ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 28: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో అమ్మాయిలను వేధింపులకు గురిచేసిన ఈవ్‌టీజర్స్‌కు శుక్రవారం కమిషనరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్ మహిళా భద్రతా విభాగం నిపుణులతో జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. మూడు నెలల్లో షీ టీమ్స్‌కు పట్టుబడిన 42మంది ఈవ్‌టీజర్లకు ఆన్ లైన్ లో మహిళలను ఎలా గౌరవించాలనే తదితర విషయాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, మహిళా పోలీస్‌స్టేషన్ శ్రీరాంపూర్ సీఐ రాజమౌళిగౌడ్, పెద్దపల్లి షీ టీమ్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, మంచిర్యాల్ షీటీమ్, సిబ్బంది ఉన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

రామగిరి, జూన్ 28 : ఉద్యోగులు గైర్హాజరు శాతం తగ్గించుకోవాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. 2023 సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు వంద మస్టర్లు చేయనివారు ఈ సంవత్సరం మే నెల వరకు కనీసం 50 మస్టర్లు కూడా హాజరు కాని ఉద్యోగులకు సీఎన్‌సీవోఏ క్లబ్‌లో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏపీఏ ఏరియాలో గైర్హాజర్ అవుతున్న 180 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా 120 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పీవో నాగేశ్వరరావు, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంచందర్, ఐఎన్టీయూసీ ప్రతినిధి సమ్మయ్య, పీఎం రవీందర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా.పద్మ, డీవైపీఎం హరీశ్, సీనియర్ పీవోలు మతీన్ హుస్సేన్, రవిచంద్ర తదితరులున్నారు.

ప్రమాదంలో కార్మికుడి మృతి

రామగిరి, జూన్ 28 : మండలంలోని సెంటినరీకాలనీలోని పన్నూరు క్రాస్ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని బైక్‌పై వస్తున్న బానోతు రాజు (60) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెంటినరీకాలనీలోని సింగరేణి క్వార్టర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న బానోతు రాజు తన బైక్‌పై పన్నూరు క్రాస్ రోడ్డుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయం కావడంతో పెద్దపల్లి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో రెండు రోజుల్లో రాజు సింగరేణిలో ఉద్యోగ విరమణ చేయనుండగా, ప్రమాదంలో మృతి చెందడంతో కార్మిక వాడలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ స్టేషన్ ఆపరేటర్‌పై దాడి

మంథని రూరల్, జూన్ 28 : మంథని మండలం గుంజపడుగులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ నల్ల సంతోష్ కుమార్‌పై గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు సంతోష్ మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు తను గుంజపడుగు గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా 3 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నానని తెలిపాడు. గురువారం అర్ధరాత్రి పనిలో ఉండగా, ఇద్దరు వచ్చి నువ్వు సత్తిరెడ్డివా అని , సత్తిరెడ్డి ఎక్కడ ఉన్నాడు, నువ్వెందుకు డ్యూటీకి వచ్చావని తన పైన దాడిచేసినట్లు తెలిపాడు. దుండగులు తన సెల్ ఫోన్ సైతం తీసుకెళ్లారని వాపోయాడు.

ప్రభుత్వ పథకాలు పేదలకందాలి

- ఓదెల సర్వసభ్య సమావేశం
- ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

ఓదెల: ఎంపీపీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఓదెల, జూన్ 28: ప్రభుత్వ పథకాలను అధికారులు పేదలకందేలా చూడాలని ఓదెల మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కోరారు. శుక్రవారం ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కునారపు రేణుకాదేవి అధ్యక్షతన జరిగింది. ఇందులో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రైతులకు వానకాలంలో ఎరువులు, ఇతర ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో కరంట్ సమస్యలు ఉత్పన్నమై ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తుండడంతో శుక్రవారం మండల పరిషత్ సిబ్బంది వారిని శాలువాలు, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఓదెల నుంచి బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సత్తయ్యను కూడా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ కునారపు రేణుకాదేవి, ఎంపీటీసీలు, ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకన్న, పీఆర్ఏఈ జిన్నా సమ్మిరెడ్డి, ఎంపీవో భాస్కర్, వివిధ శాఖల అధికారులున్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేశాం

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తీర్మానం
- ఎన్టీపీసీలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

జడ్పీ చైర్మన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జడ్పీ సీఈవో

జ్యోతినగర్, జూన్ 28: గత ఐదు సంవత్సరాల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశామని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట పుట్టమధూకర్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్మన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా సమావేశంలో వ్యవసాయం, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖలపై ప్రధానంగా చర్చ జరిగింది. వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జూలై 30లోగా ప్రభుత్వ హామీ మేరకు రైతు భరోసా నిధులు, రైతు కూలీలకు రూ.12వేలు పంపిణీ చేయాలని, ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని, ధాన్యానికి రూ.500 బోనస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ప్రవేశ పెట్టాలని ఓదెల జడ్పీటీసీ గంట రాములు ప్రతిపాదించారు. దానిని పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణి బలపర్చగా, సమావేశంలోని సభ్యుల అంగీకారంతో ఆ తీర్మానాన్ని జడ్పీచైర్మన్ ఆమోదించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. సీఎం అల్పాహార పథకం అమలుపై సభ్యులు ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జడ్పీచైర్మన్ మాట్లాడుతూ వచ్చే నెల జూలై4తో స్థానిక సంస్థల గడువు ముగుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం ధ్యేయంగా ఐదేళ్లుగా 20 జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించామన్నారు. ఈ ఐదేళ్లలో తాను నిస్వార్థంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేశానన్నారు. సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులు జడ్పీ చైర్మన్‌ను సన్మానించారు. ఇక్కడ జడ్పీ సీఈవో నరేందర్, ధర్మారం జడ్పీటీసీ పూస్కూరు పద్మజా జితేందర్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీబలరాంరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సలాముద్దీన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడిగా ఫణి శర్మ

పెద్దపల్లి, జూన్ 28: ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని ఆయా రైల్వే మార్గాల్లో నూతన రైళ్ల ప్రతిపాదనలు, స్టేషన్లలో నెలకొన్న సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం, తదితర సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతనంగా ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆవిర్భవించింది. ఫోరం తొలి అధ్యక్షుడిగా పెద్దపల్లి పట్టణానికి చెందిన ఫణి శర్మ, ఉపాధ్యక్షుడిగా అజయ్ క్రాంతి సింగ్, జాయింట్ సెక్రటరీగా సిరిపురం సాయి కృష్ణ, జనరల్ సెక్రెటరీగా కలవేన శ్రీనివాస్, ట్రెజరీ గంగుల మోహన్ ఎన్నికయారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పుట్టి, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరంగా ఆవిర్భవించిందని ఫణిశర్మ వెల్లడించారు.

గడువులోగా భూ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్ : తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్, జూన్ 28 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జాహెద్‌పాషాకు కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. భూసమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులు తిరస్కరించే సమయంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అనంతరం వెన్నంపల్లి, మంగపేట, కూనారం, పెగడపల్లి, కస్తూర్బా, గంగారం ప్రభుత్వ పాఠశాలలతో పాటు, మంగపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మంగపేట పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ నూనేటి సంపత్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వంద శాతం గర్భిణీల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ వైద్య సిబ్బందికి సూచించారు. కాల్వశ్రీరాంపూర్, కూనారం ప్రభుత్వ దవాఖానలను పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ వైద్యాధికారి కృపాబాయి, పాఠశాల అకాడమీ అధికారి డాక్టర్ పీఎం షేక్, జీసీడీవో కవిత, ఎంఈవో సురేందర్, డాక్టర్లు భావన, శ్రీనివాస్, మహేందర్, పీఆర్ ఏఈ మల్లేశం, ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శులు, తదితరులున్నారు.

జాతీయ రహదారి భూ సేకరణ పూర్తి చేయాలి

పెద్దపల్లి, జూన్ 28: వరంగల్–మంచిర్యాల మధ్య 4 లేన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల –వరంగల్ జాతీయ రహదారి భూసేకరణపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారి నిర్మాణం భూ సేకరణ ప్రక్రియ పురోగతి వివరాలు కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్లు, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, సీపీవో గంప రవీందర్, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులున్నారు.

సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ ఆందోళన

పెద్దపల్లి టౌన్, జూన్ 28: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో కనీస వసతులు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థపైన ఎమర్జెన్సీ విధించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకి వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ బడుల్లో వసతులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన విద్యా రంగంపై ఎమర్జెన్సీ విధించినట్లు కనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఫీజుల దోపిడీని అరికట్టాలని, బడుల్లో బహిరంగ ప్రదేశాల్లో పాఠ్యపుస్తకాలు అమ్మరాదని, బడుల్లో కనీసవసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకలు అజయ్, రాసురి ప్రవీణ్, అరవింద్, సందీప్, వంశీ, విష్ణు, సిద్ధార్థ్, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు ఖరారు

పెద్దపల్లి, జూన్ 28: పారదర్శకంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సంబంధించిన టెండర్లు ఖరారు చేశామని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి దాఖలైన టెండర్లను ఓపెన్ చేశారు. ఆరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు కోడిగుడ్డు, చికెన్, పండ్లు, కూరగాయల సరఫరాకు సంబంధించిన టెండర్లను అదనపు కలెక్టర్ టెండర్ దారుల సమక్షంలో ఓపెన్ చేసి ఖరారు చేశారు. ఇక్కడ సాంఘిక సంక్షేమ శాఖ విద్యాలయాల సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ జేజేథెరిస్సా, డీపీసీసభ్యులున్నారు.

పర్యావరణ పోటీలు

జ్యోతినగర్, జూన్ 28: ఎన్జీసీ తెలంగాణ కంట్రోల్ బోర్డు సూచన మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జీసీ) పాఠశాలలకు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఎన్జీసీ పాఠశాలల నుంచి 200మంది విద్యార్థులు హాజరై ప్రతిభను చాటుకున్నారు. జిల్లా విద్యాధికారి మాధవి హాజరై విజేతలకు మెమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇక్కడ హెచ్ఎం జయరాజు, జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ అంజన్‌కుమార్, రమేశ్, శ్రీధర్, శంకరయ్య ఉన్నారు.

కార్మికుల వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలి

మంథని, జూన్ 28: మంథని ప్రభుత్వ దవాఖానలో ఐదు నెలల వేతనాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 10 నెలల వేతనాలు రాక సెక్యూరిటీ, కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ డిమాండ్ చేశారు. మంథని ప్రభుత్వ దవాఖాన సూపరిండెంట్ రాసిన వినతి పత్రాన్ని దవాఖానలోని అధికారులకు శుక్రవారం అందించారు. ఇక్కడ శ్రావణ్, భరత్, చంద్రయ్య, రమాదేవి, పూర్ణిమ, లక్ష్మి, ఓదెమ్మ, లక్ష్మి, అనసూయ, ఉమ, ప్రమీల పద్మ, శంకరమ్మ, శ్రీకాంత్‌లున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్, జూన్ 27: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు జూలై 1 సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 2న పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఉత్పత్తికి అంతరాయం కలుగద్దు

యైటింక్లయిన్ కాలనీ జూన్ 28 : వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కల్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టును డివిజన్ జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. ఓసీపీ–3 ప్రాజెక్టులోని క్వారీలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట పీవో మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు, ఎస్ ఎస్‌వో షరీఫ్ మొహమ్మద్ ఉన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

సుల్తానాబాద్, జూన్ 28: దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ముదిగంటి రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలంలో దివ్యాంగుల యూనియన్‌ను ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మేకల రాజయ్య, పెగడ రాజమౌళి, కడారి కిషన్ రావు, పద్మ దామోదర్, మండల దివ్యాంగుల సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఆర్టీవో రంగారావు

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీవో రంగారావు, రవాణా ఉద్యోగులు, సిబ్బంది

పెద్దపల్లి, జూన్28: ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌పై దాడి చేసిన ఆటో యూనియన్ జేఏసీ నాయకుడు అమానుల్లా ఖాన్‌ను కఠినంగా శిక్షించాలని ఆర్టీవో పీ రంగారావు అన్నారు. జేటీసీపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో, ఉద్యోగులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీ లు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఇక్కడ ఎంవీఐలు మసూద్, భీమ్ సింగ్, సిబ్బంది ఉన్నారు.

నాణ్యత పాటించని హోటళ్లపై ఫిర్యాదు

కోల్‌సిటీ, జూన్ 28 : రామగుండం కార్పొరేషన్ పరిధిలో కొంత కాలంగా ప్రధాన రోడ్ల పక్కన పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన హోటళ్లు, బిర్యానీ, కర్రీ పాయింట్లు నాణ్యత పాటించడం లేదని శుక్రవారం ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు పెద్దపల్లి జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ తరఫున ఫిర్యాదు చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ హోటళ్లలో కల్తీ ఆహార నిరోధక చట్టం ప్రకారం నిరంతరం తనిఖీలు పర్యవేక్షణ చేయాల్సి ఉందన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతులు లేకుండానే కర్రీ పాయింట్లు, బిర్యానీ పాయింట్లు వెలుస్తున్నాయనీ, వీటిలో నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఇలాంటి హోటళ్లలో తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్, ప్రధాన కార్యదర్శి కనకరాజ్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, సాయి తదితరులున్నారు.

పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మధూకర్

పీవీ ఆర్థిక సంస్కరణలతోనే దేశాభివృద్ధి

మంథని, జూన్ 28: భారతదేశ ప్రధాన మంత్రిగా పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పీవీ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ తరగం సుమలత, కౌన్సిలర్ ఆరెపల్లి కుమార్, బీఆర్ఎస్ నాయకులున్నారు.

గోదావరిఖని, జూన్ 28: పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులున్నారు.

కేసీఆర్ పాలనలోనే సింగరేణి ప్రక్షాళన

- పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, జూన్ 28: ఉమ్మడి రాష్ట్రంలో నిర్వీర్యమైన సింగరేణిని కేసీఆర్ తన పాలనలో ప్రక్షాళన చేసి కార్మికులకు మేలు చేశారని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. ఇంక్రిమెంట్, ఇండ్ల నిర్మాణానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి అండగా నిలిచారని చెప్పారు. ఇంత చేసిన కోల్‌బెల్ట్ ఏరియాలోని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని, ఇందుకు టీబీజీకేఎస్ నాయకులే కారణమని ఆరోపించారు. టీబీజీకేఎస్ నేతగా ఉన్న మిర్యాల రాజిరెడ్డి వల్లనే అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయామని చెప్పారు. శుక్రవారం మంథనిలోని తన నివాసం రాజగృహలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాల రాజిరెడ్డి తీరును ఎండగడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖను విలేకరులకు చూపారు. అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూలేనివిధంగా కేసీఆర్ ప్రభుత్వం 16వేల కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించిందని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ తగరం సుమలత శంకర్, ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, నాయకులు తగరం శంకర్‌లాల్, సెగ్గెం రాజేశ్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజుగౌడ్, జంజర్ల శేఖర్ ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ అరుణశ్రీ

మొక్కలు లేని ఖాళీ బ్యాగులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అరుణశ్రీ

ముత్తారం, జూన్ 28: మండలంలోని దర్యాపూర్ గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని పెద్దపల్లి జాయింట్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్న గుంతలను పరిశీలించారు. నర్సరీని సందర్శించారు. మొక్కలు గుర్తించే సూచిక బోర్డులు లేవని, మొక్కలు లేకుండా ఖాళీ బ్యాగులు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈ రాజ్ కుమార్, డీఎల్‌పీవో శంకర్ , పీఆర్ఏఈ వరలక్ష్మి, ఎంపీవో వేణుమాధవ్, ఏఈ ప్రణవ్, కార్యదర్శి ప్రేమలతలున్నారు.

నూతన కలర్ ప్రింటర్ ప్రారంభం

గోదావరిఖని, జూన్ 28 : సింగరేణి ఆర్జీ–3 జీఎం కార్యాలయంలోని సర్వే విభాగంలో సుమారు రూ.2.5 లక్షలతో కొనుగోలు చేసిన నూతన ఫ్లోటర్ కలర్ ప్రింటర్‌ను శుక్రవారం ఆర్జీ3 జీఎం సుధాకర్ రావు ప్రారంభించారు. ఇక్కడ ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏజీఎం శ్రీనివాసులు, సర్వే అధికారి జనార్ధన్‌రెడ్డి, సివిల్ డీజీఎం పద్మరాజు తదితరులున్నారు.

వందకు పెరిగిన ఈపీ ఆపరేటర్ పోస్టులు

గోదావరిఖని, జూన్ 28: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఖాళీగా ఉన్న ఇంటర్నల్ అభ్యర్థులకు విడుదల చేసిన ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టులు 60 నుంచి 100కు పెంచినట్లు సింగరేణి సెక్యూరిటీ, పర్సనల్ జీఎం, వెల్ఫేర్, ఆర్‌సీ(ఎఫ్ ఏసీ) బీఆర్ దీక్షితులు శుక్ర